# రెండో వైపు

డి. కామేశ్వరి



'నీకు ప్రేమించడం రాదు, ఫో' అని ఛీ కొట్టింది కావేరి. అంతటితో వూరుకోకుండా 'నీకసలు రొమాన్స్ స్పెల్లింగే తెలీదంది. శృంగారం అంటే అర్థమే తెలియ దని మరీ దెబ్బకొట్టింది. అంతటితో ఆగిందా నీవసలు మగాడివేనా అన్న అనుమానం వస్తొంది అంటూ మహా వ్యంగ్యాంగాస్త్రం వదిలి కసిగా చూసింది. మగాడ్నో కాదో ఆవిడకి తెలియదేమిటి. పెళ్లి కాక ముందూ తెలుసు- పెళ్లయిన ఈ ఆర్నెల్లలోనూ తెలియ దేమిటి? అలాంటి అర్థం పర్థం లేని వాగుళ్లకి జవాబిచ్చే ఓపిక నాకు లేదు. నిమ్మకి నీరెత్తినట్టు అంత మాటన్నా రియాక్టవని మొగుడ్ని ఏం చెయ్యలేక ఉక్రోషంగా- 'ఓ సరదా, సరసం తెలీని మొగుడితో కాపురం చెయ్యాల్సిన ఖర్మ నాకేం లేదు' అంటూ రెండో బెడ్ రూము తలుపు భళ్లున తెరిచి, ధాం అని మూసింది- యీ సీనేం మొదటిసారి కాదు యింట్లో!

దొరికిందే ఛాన్సు హాయిగా నిద్రపోవచ్చు అను కుని లైటార్పి పక్క మీద వాలానో లేదో నిద్ర ముంచుకు వచ్చింది. ఆవిడ అలక తీర్చే ఓపిక నాకు లేదు. పొద్దుట చూడొచ్చు ఆవిడ గారి సంగతి!

ఉదయం ఎనిమిదింటికి యింట్లోంచి వెళ్లిన మొగుడు రాత్రి ఏ తొమ్మిదో, తొమ్మిదిన్నరకో కొంప చేరిన వాడికి; రోజంతా ప్రాజెక్ట్ పని, మీటింగులు, డిస్కషన్స్- కంపూటరతో కుస్తీలు పట్టి, గంటన్నర సేపు ట్రాఫిక్‌లో పడి యిల్లు చేరినవాడికి, రోజంతా మట్టి తట్టలు మోసిన వాడికంటే కూడా అల్సిపోతాడని తెలీదా! మట్టితట్టలు మోసిన వాడికి శారీరక శ్రమే. తనలాంటి ఎగ్జిక్యూటివ్స్‌కి ఫిజికల్ స్ట్రెయిన్‌తో పాటు మెంటల్ స్ట్రెయిన్ తోడయి మనిషి రోజు పని పూర్తయ్యే సరికి ఏ రోజుకి ఆరోజు చెరుకు పిప్పిలా, రసం తీసేసిన మామిడి పండులా మిగులుతాడని ఈ పెళ్లాలకి తెలీదా. పోనీ ఏ చదువు సంధ్యా లేని ఉద్యోగానుభవం లేని గృహిణులుగా మాత్రం

వున్న వారికి తెలియక పోవచ్చు. కాని యీవిడ గారికి తెలియదా! ఏమన్నా అంటే, పెళ్లయ్యేంత వరకు చుట్టూ తిరుగుతారు, అప్పుడెక్కడ నుంచి దొరికిందో టైము- అప్పుడు చెట్ల చాటున, కారుల్లో అవకాశం కోసం అర్రులు చాచే రొమాన్స్ యిప్పుడేం అయిందో! అంతే, పెళ్లాం కాగానే ప్రేయసి కనిపించదు పెళ్లాంలో అని దెప్పడం- అల్సిన శరీరం విశ్రాంతి కోరుతుంది- రొమాన్స్, శృంగారం ఏమిటి నా బొంద. ఎప్పుడు పక్కమీద వాలుదామా అనిపిస్తుంది తప్ప- ఇవేం యిదివరకటి రోజులా! గవర్నమెంటు ఉద్యోగాలా పదింటికెళ్లి ఐదు గంటలకి కొంప చేరడానికీ, సావకాశంగా పడక కుర్చీలో చేరబడి భార్యామణి గారందించిన పకోడీల ప్లేటు అందుకొని తింటూ కబుర్లు చెప్పి ఆనక సినిమాకో, షికారుకో తిరగడానికి. శని ఆదివారాలొస్తే సినిమాలకి, స్నేహితుల యిళ్లకి తిరగడానికి యిపుడు టైమేది. నెలలో రెండు వారాలు పై వూర్లు తిరగాలి- ఏ ఆదివారమో అనుకోని పని వచ్చి పడ్తుంది. ఇప్పుడీ ప్రైవేటు కంపెనీల, కంప్యూటరు ఉద్యోగాలకి టైము ఏమీ వుండదు- రిజల్ట్ ఓరియంటెడ్ జాబ్స్- నీవెంత కష్టపడ్డావో ఎవడికీ అక్కరలేదు- ఏం చేశావో రిజల్ట్ చూపించాలి- ఆర్డర్లు కావాలి, లాభాలు చూపాలి, టార్గెట్ అందుకోవాలి. యిచ్చిన జీతాలకి పని పిండు కుంటారు. వాళ్లేం వెర్రివాళ్లా? యిలా పాసయి వచ్చిన వాళ్లకి ఏభై వేలు జీతాలివ్వడానికి? జీతాలు, ఫోను, కారు- ఫ్లయిట్ టిక్కట్లు యివన్నీ వూరికే కూచోపెట్టి యివ్వరు అన్నది చదువుకున్న కావేరి లాంటి వాళ్లకీ తెలీదా! ఆదివారం వస్తే యిల్లు కదలాలనిపించదు. కమ్మగా తిని కంటి నిండా నిద్రోవాలని యింకా టైముంటే పర్సనల్ పనులు చూసుకోడానికే సరి పోతుంది- పిల్లలుంటే సరే సరి!

ఆవిడ గారికి ఫామిలీ స్టార్ట్ చెయ్యాలనిపించడం బాగానే వుంది- ముప్పై ఏళ్లు వచ్చాయి యింకెప్పుడు కంటాం అంది. అదీ బాగానే వుంది. కాని పిల్లలు కావాలనగానే స్విచ్ నొక్కి రైస్ కుక్కరు పెడితే అన్నం తయారయినట్టు టి.వి. ఆన్ చేయగానే ప్రోగ్రాం వచ్చినట్టు పిల్లలు పుట్టుకు రారు గదా! లేడికి లేచిందే పరుగన్నట్టు ఆవిడ కావాలనుకున్న మరుక్షణం ఆ నెలే తప్పాలంటే ఎలా! ఉద్యోగం బోరు కొట్టింది చేసి చేసి, కొన్నాళ్లు మానేస్తాను అంటే పాతిక వేల ఉద్యోగం వదిలేస్తానన్నా 'ఇటీజ్ అప్ టూ యూ' అనలేదూ, తనేమన్నా అన్నాడా!

ఈ ఆడవాళ్లు ఎంతసేపు మగాడి తప్పుల్నే గ్లోరిఫై చేస్తారు. ఈ రచయిత్రులెంతసేపూ ఆడవాళ్ల ప్రాబ్లమ్స్ మీదే రాస్తారు. మగాడికి సమస్యలే లేవనుకుంటారు కాబోలు! కష్టాలన్నీ ఆడవాళ్లకే అనుకుంటారు- ఆడ వాళ్ల దృక్పథంతోనే చూస్తారు తప్ప మగవాడి పాయింట్ ఆఫ్ వ్యూతో చూడరు.

పెళ్లి కాక ముందు అమ్మాయిలని ఆకర్షించడానికి పడే పాట్లు పెళ్లయి పెళ్లాం అయినా పడాలంటే ఎలా! ఇదేం సినిమానా, డ్యూయట్లు పాడుకుంటూ చెట్ల చుట్టూ పరిగెడ్తూ ఓ సీనులో స్విట్జర్లాండ్, ఇంకో సీను కోనసీమలోనూ చిత్రించడానికి- నిజమే- డేటింగ్ టైములో కావేరి కోసం ఆమెతో స్నేహం కోసం అర్రులు చాచాడు- యింప్రెస్ చేయడానికి హోటళ్లకి, సినిమాలకి, పార్కులకి తిప్పాడు- ఇప్పుడూ అలా అంటే ఎలా? ఉద్యోగం సద్యోగం మానేసి రోజంతా ఆవిడ చుట్టూ కొంగు పట్టుకు ఎలా తిరుగుతాడు- అప్పుడెలా టైము దొరికిందీ అంటే... ఏదో మోజులో, ఆకర్షణలో నానా గడ్డి కరిచి టైము సర్దుబాటు చేసుకుంటారు అబ్బాయిలు- అమ్మాయితో గడిపిన టైము ఓవర్ టైము చేసి పని పూర్తి చేసో, ఏ ఫ్రెండు కాళ్లో, గడ్డమో పట్టుకు పని చేయించడం- చేయకపోతే బాస్ చేత చివాట్లు తినడానికేనా సిద్ధపడతారు. బ్యాచిలర్‌గా ప్రవర్తించి నట్టు పెళ్లయ్యాక బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే ఉద్యోగం ఊడితే భార్య, సంసార బాధ్యతలున్నాయన్న భయం వుండదూ! యివన్నీ ఆడవాళ్ల కర్థం కావు- ఎంతసేపు తననే తప్పు పడ్తుంది- ఏం తను మాత్రం తనని ఆకర్షించడానికి, యింప్రెస్ చెయ్యడానికి ఎంత తాపత్రయ పడేదీ- ఎంత చక్కగా రోజుకో రకంగా అలంకరించుకునేదీ- ఎంత మంచి డ్రస్సులు వేసి, తనకి చీర ఇష్టమని చీరలు కట్టి, శ్రద్ధగా మొహం దిద్దుకుని, లిప్‌స్టిక్ వేసుకుని, రోజుకో రకం పెర్ఫ్యూం చల్లుకునేదీ. మరిప్పుడూ అలా వుందా తను- రోజంతా బురఖా లాంటి నైట్ గౌను తగిలించుకుని, పొద్దుటంతా క్రీములు మొహాన్నికి పట్టించి, జుత్తు రబ్బర్ బ్యాండ్ ముడేసి కూర్చుంటుంది- బైటికి వెడితేనే ముస్తాబు! మొగుడు మొహానికి చాల్లే అనుకుంటారు గాబోలు పెళ్లాలు- పుట్టిం రోజంటే అర్ధరాత్రి పన్నెండుకి విష్ చేసి, తెల్లారి బొకేతో గుమ్మం ముందు నిలబడి, స్వీట్ తినిపించి, లంచ్, డిన్నర్లు యిచ్చి మంచి కుర్తా, పైజమా కుట్టిపించి... యిప్పుడవన్నీ చేస్తుందా తను మాత్రం! శ్రద్ధగా తనకిష్టమైనవి వండించి తెచ్చి తినిపించేది- యిప్పుడో, పొద్దుటే ఆ కుక్కరులో పప్పు, కూర ఏదో వండాననిపించి డైనింగ్ టేబిల్ మీద పడేస్తుంది- రావడం ఓ గంట ఆలస్యమైతే తను తినేసి టి.వి. చూస్తూ కూర్చుంటుంది. వచ్చాక కాస్త వేడి చేసన్నా పెడ్తుందా! పెట్టుకు తింటాడులే అన్న నిర్లక్ష్యానికి తను బాధపడుతున్నాడా! యీ రోజుల్లో ఆడవాళ్లకి కుక్కర్లు, గ్రైండర్లు, ఓవెన్‌లు వచ్చి వంటంటే అరగంటలో చేసి పడేసి ఏదో కష్టపడు తున్నట్టు ఫోజులు! వాషింగ్ మెషీన్‌లో బట్టలు వేయడం కూడా చాకిరిలా ఫీలయిపోతున్నారు. ఉద్యోగం చేస్తే సరే, వుత్తినే యింట్లో వుండి కూడా మొగుడు అల్సిపోయి వచ్చాడు కాస్త దగ్గర కూర్చుని అన్నం పెడదామనుకుంటుందా! మార్పు తనలో లేదా! మొగుళ్లనే తప్పు పట్టడం ఫేషనయింది ఆడవాళ్లకి.

ఆవిడగార్కి పిల్లలు కావాలనుకోడం బాగానే వుంది- దానికి తగిన వాతావరణం, మూడ్ కల్పించ వచ్చు కదా! మూతి ముడుచుకుని అలకలు, సాధింపులు, మాటలు చేతలతో విసుర్లు కాకుండా- యింటికొచ్చేసరికి నవ్వు మొహంతో "అల్సిపోయారు వుండండి గీజర్ ఆన్ చేశాను, టబ్ నింపుతాను వేడి నీళ్లతో అని ఓ రెండు చుక్కలు ఉడుకులాం వేసి, స్నానం చేశాక తెల్ల పైజమా కుర్తా తీసి అందించి, డైనింగ్ టేబిల్ దగ్గర వేడిగా అనురాగం వడ్డించి- ఆపైన చక్కగా నాలుగు తమలపాకులు కిళ్లీలు చుట్టిచ్చి- రెండు అగరువత్తులు గదిలో వెలిగించి- తెల్ల చీర కట్టుకుని, మల్లెపూలు తురుముకుని-" ఊరుకో బాబూ, మరీ అంత అత్యాశ వద్దంటున్నారా- యిప్పుడంత సీను లేదయ్యా, యివన్నీ పాత సినిమా సీనులంటారా! కరక్టే సార్- ఇదంతా హైటెక్ యుగం. యిప్పుడెవరికీ అంత టైము లేదు. ఉద్యోగాల బాధ్యతతో పిల్లలని కనడానికీ టైము లేక పోస్ట్‌పోన్ చేసుకునే రోజులు! ఎంతసేపు కోర్సుల మీద కోర్సులు చేసి, జాబ్‌లో ఎంత ఎదిగిపోదామా, ఎన్ని ఉద్యోగాలు మార్చి పైపైకి వెళ్లిపోయి టాప్ పోస్ట్‌కి వెళ్లి లక్షలలా ఆర్జించడమా అని తప్ప స్త్రీ పురుష సంబంధాలు కూడా మెకానికల్‌గా టైమ్ షెడ్యూల్లోకి వెళ్లిపోయాయి- రొమాన్స్, శృంగారం అన్న పదాలకి తావు లేని హడావిడి, యాంత్రిక జీవితం- వంట్లో ఓపిక, ఉత్సాహం అంతా డబ్బు సంపాదించడానికే సరిపోతుంది. ఏం తింటున్నాం, ఏం సుఖపడ్తున్నాం అన్న భావనే లేదు. ఏదో పెళ్లి కాక ముందు కాస్త నచ్చిన అమ్మాయి కనిపిస్తే టేస్టు, భావాలు కల్సాయని భ్రమించి పెళ్లాడడం, ఆ ఆకర్షణ నాలుగు రోజుల ముచ్చటయి జీవితం రొటీనయిపోవడం, ఇదివరకు తరాలలో డబ్బులు పుష్కలంగా లేకపోయినా సౌకర్యాలు తక్కువయినా, సంపాదించేది ఒకరయినా యింట్లో సుఖ సంతోషాలుండేవి- భార్యా భర్త పిల్లలు కల్సి సినిమా, షికార్లు తిరగడం, పండగలకి పబ్బాలకి చుట్టాలు రాకపోకలు ఆప్యాయతలుండేవి. ఇప్పుడీ యువత డబ్బు సంపాదించే మిషనుల్లా మారి పోయారు- జీతాలంటే బోలెడు! అవి యిచ్చే వస్తు సుఖాలు- తప్ప అనురాగాలు ఆప్యాయతలు ఏవి!... నిద్రంతా, కలత నిద్ర ఆలోచనలతో... పడుకో బాబూ పడుకో, మళ్లీ పొద్దుట ఆఫీసుకెళ్లద్దూ- తనని తాను జోకొట్టుకున్నాడు హరీష్.

✧✧✧

పొద్దుట లేచేసరికి కావేరి మాయం- డైనింగ్ టేబిల్ మీద పళ్ల బౌల్ కింద నోట్- 'భార్య కావలిస్తే వచ్చి తీసికెళ్లు- క్షమాపణలతో- టైమ్ లిమిట్- నెల'. ఎంత పొగరో చూశారా! ఏం తప్పు చేశానని వెళ్లి క్షమాపణలు చెప్పి తీసుకురావాలో... పోనీ... హాయిగా, ఇరవై తొమ్మిది రోజులు గడిపి ఆఖరు రోజు ఆలోచించవచ్చు- యీ తిక్క వేషాలు చూసే ఆ మొదటి మొగుడు ప్రాణం విసిగి డైవోర్సు యిచ్చి వుంటాడు! మొదటి మొగుడేమిటి- అయ్యో, చెప్పలేదా! ఈవిడగారికిదివరకో పెళ్లి అయింది- తను డైవోర్సీ అని తెలిసీ, మావాళ్ల కిష్టం లేకపోయినా, వాళ్లు పెళ్లికి రామని చెప్పినా కావేరిని ప్రేమించి పెళ్లాడాను- ఏదో ఘనకార్యం, త్యాగాలు చేశానని చెప్పను గాని తనకీ కృతజ్ఞతన్నా లేదే అనిపిస్తే అది నా తప్పా! టైమ్ లిమిట్ నెలట! నెల దాటితే ఏం చేస్తుందో! మళ్లీ డైవోర్సు యిస్తుందా.

ఈవిడగారు పుట్టింటికి వెళ్లేసరికి అక్కడి సీన్ ఊహించవచ్చు. 'అదేమిటే చెప్పా పెట్టకుండా వంటరిగా వచ్చావు' అంటుంది వాళ్ల మామ్మ ఆశ్చర్యంగా- 'ఏం చెప్పి రావాలా' అని యీవిడ దబాయించి మేడ మీదకెళ్లి పోతుంది- 'ఏం పుట్టింటికి రావడానికి హక్కు లేదా' అంటూ తల్లి తండ్రి అడిగినా అదే ధోరణిలో అంటుంది- చూద్దాం వాళ్లకేం చెపు తుందో! వాళ్లు నాకేదన్నా ఫోను చేస్తారేమో అదీ చూస్తాను...! ఈ పెళ్ళన్నా బుద్ధిగా నిలుపుకో యీసారీ తిక్క వేషాలేస్తే అంతే సంగతులు- అలా ఊ- ఆ- అంటే విడాకులు యిచ్చి ఎన్ని పెళ్లిళ్లు చేసుకుందా మనుకుంటున్నావు. మూడోసారి నీవు చేసుకుందా మన్నా నిన్ను చేసుకునే వాడు దొరకద్దూ- అంటూ కూతురికింత గడ్డి పెట్టకుండా వుంటారా! దాంతో యీవిడ గారు దారికి వస్తుందన్న నమ్మకం నాకేం లేదు. ఏదో ఆలోచించి నేనే ఒక షాక్ ట్రీట్‌మెం టివ్వాలి- ఆలోచనల మధ్యే తయారయి ఆఫీసుకెళ్లి పోయాడు హరీష్.

✧✧✧

నాలుగో రోజు రాత్రి ఫోను మోగింది- తీస్తే అట్నించి

మామగారు! 'హలో సార్, హౌ ఆర్ యూ' కావాలనే చాలా కులాసాగా పలకరించాను. ఆయన ఒక్క హలోతో సరిపెట్టేసి డైరక్ట్‌గా పాయింటు కొచ్చేస్తారు. 'కావేరి వచ్చి మూడు రోజులయింది' అన్నాడు. 'అవునంకుల్' అమాయకంగా అన్నాను. 'ఏం జరిగిందసలు?'. 'నాకేం తెలియదు అంకుల్. పొద్దుట లేచేసరికి డైనింగ్ టేబిల్ మీద చీటి వుందంతే-'. 'అంటే, నీకు చెప్పకుండానే వచ్చిందా! అసలు ఏంటి గొడవ.' 'నాకేం తెలుసు మీ అమ్మాయి అక్కడే వుంది అడక్కపోయారా' గడుసుగా అన్నాను. 'అదేం చెప్పలేదు-వూరికే వచ్చానంది'. 'అయితే సరే, ఊరికే, మళ్లీ బుద్ధి పుడితే యిటొస్తుందిలెండి' చాలా తేలిగ్గా అన్నాను. పాపం ఆ మహానుభావుడికింకేం మాట్లాడాలో తెలియక, అల్లుడ్ని ఎలా నిలదియ్యాలో తెలియక జుట్టు పీక్కుంటున్నారేమో. 'అయితే మీ యిద్దరి మధ్య ఏం గొడవ జరగలేదా' మళ్లీ రెట్టించా డాయన.

'నా తరపు నించి, ఏం గొడవ జరిగినట్టు గుర్తులేదు- మీ అమ్మాయికేమన్నా గుర్తుందేమో అడగండి-' మళ్లీ క్షణం మౌనం... "ఏం జరగకపోతే వచ్చిం దగ్గర నుంచి మూడీగా వుంది- మాట్లాడిస్తే కరుస్తూంది- ఏం చెప్పందే మాకెలా తెలుస్తుంది- యిద్దరికిద్దరు యిలా అయితే ఎలా హరీష్- పెద్ద వాళ్లం ఏదో సలహా చెపుతాం సంగతి తెలిస్తే- సర్దుబాటు చేస్తాం- పంతాలకి పోతే ఎలా చిన్న చిన్న విషయాలకే..."

'అది మీ అమ్మాయికి చెప్పాల్సిన మాటండీ' నవ్వుతూ అన్నాను.

'అమ్మాయికీ చెప్పాను, మీకూ చెప్తున్నాను' కాస్త అసహనం ధ్వనించింది.

'చూడండి సార్... ఐ హావ్ నో కంప్లయింట్స్ ఎబౌట్ హర్- ఆవిడకేం వున్నాయో నాకు తెలీదు- గుడ్ నైట్' అంటూ ఫోన్ పెట్టేశాను.

'ఆ అబ్బాయి పాపం తనకేం తెలీదంటున్నాడు. తనేం దీని గురించి కంప్లయింట్ చేయలేదు. అబ్బాయి పాపం నవ్వుతూ మామూలుగానే మాట్లాడాడు... 'మామగారు కాంప్లిమెంట్ యిచ్చి వుంటారు'. మనమ్మాయి సంగతి మనకు తెలుసు. ఊ- ఆ- అంటే చాలు దీనికి తిక్క వస్తుంది- తననుకున్నది కాన్త యిటు అటు అవరాదంటుంది. తప్పు మనమ్మాయిలో వుంచుకుని అతన్నేం అనగలం- అత్తగారు మామగారు తర్జనభర్జనలు పడుతుంటారు. కూతుర్ని పిలిచి ఫోను విషయం చెపితే 'మిమ్మల్నెవరు ఫోను చెయ్యమన్నా రంటూ' ఎగరవచ్చు ఆవిడ గారు. చెప్పుకోనీ ఏ కారణం చెప్పుకుంటుందో! నా మొగుడికి రొమాన్స్ తెలీదు. పిల్లలు కావాలంటే కో ఆపరేట్ చెయ్యడం లేదు అని చెప్పుకోనీ! మొగుడ్ని బ్లేమ్ చేసే ముందు తన లోపాలు యీ యిరవై రోజుల్లో తెల్సుకోనీ!

✧✧✧

కురవక కురవక మబ్బులు దట్టంగా కమ్మి వర్షం కురుస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నప్పుడు మేఘాలు తేలిపోతే ఎంత నిరాశ- ఆ నిరాశ నిజం కాదు అంటూ మేఘం లేకుండానే వర్షం కురిస్తే కలిగే ఆనందం- రకరకాల టెస్టులు, ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు చేసి డాక్టరేం అంటాడో అని బెంగపడే పేషంట్‌కి ఏం జబ్బు లేదని క్లీన్ చిట్ యిస్తే కలిగే ఆనందం- ఆరోజు మా అత్తవారింటి వాళ్ల మొహాల్లో కనపడింది నాకు- కూతురు పంతం తెలిసి, అల్లుడు వచ్చి తీసుకెళ్లకపోతే వెళ్లదని తేలక, ఏ తప్పులేని అల్లుడిని ఎలా తప్పుపట్టడం, ఎలా రమ్మనడం, కూతురు కాపురం ఎలా నిలబడుతుంది అని మధనపడుతున్న వేళ పిలవకుండానే అల్లుడింటికి వస్తే ఎంత రిలీఫ్ దొరుకుతుందో అది వాళ్ల మొహంలో కన్పించింది. కావేరి తెల్లబోయి చూసింది- డైనింగ్ టేబిల్ దగ్గరున్న అందరూ సంభ్రమంగా ఆహ్వానించారు- 'హాయ్ కావేరీ' నవ్వుతూ పలకరించా. మొహం ఈసారి నల్లబడింది. 'రా హరీష్.. రా. ఫోనన్నా చేయొచ్చు గదా-' మామగారి పిలుపు- 'రా నాయనా, భోం చేద్దువు గాని' అత్తగారి పలకరింపు- 'బాగున్నావా నాయనా' మామ్మగారి ఆప్యాయత. 'ప్లజంట్ సర్‌ప్రైజ్ బావగారూ-' బావమరిది పలకరింపులు అయ్యాక... 'మంచి పని చేశావు, శని ఆదివారాలు చూసి రెండు రోజులుండేట్టు వచ్చావు సంతోషం నాయనా' అన్నారత్తగారు.

'శని ఆదివారాలేం ఖర్మ. యింక రోజూ సండేలే- జాలీ డేలే' సరదాగా అన్నా- అంతా దిమ్మెరపోయారు. 'అదేమిటి' అంతా ఒక్కసారే అన్నారు.

'జాబ్ రిజైన్ యిచ్చేశానండీ. యీ కార్పొరేట్ ఉద్యోగాలు, హైటెక్ ఉద్యోగాలు చేయదలచుకోలేదు... ఏమిటండీ ప్రాణానికి సుఖం లేకపోయాక డబ్బేం చేసుకుంటాం- ఏ ఆనందం, సుఖం లేని యీ ఉద్యోగాలెందుకు, డబ్బు సంపాదించడం ఒక్కటే ధ్యేయంగా పెట్టుకుంటే జీవితంలో చాలా కోల్పోతున్నానని అర్థం అయి రిజైన్ యిచ్చేశా- ఏదో నైన్ టూ ఫైవ్ ఉద్యోగం- ఏదో మామూలు కంపెనీలో చూసుకుంటాలెండి' చాలా విరక్తిగా అన్నా. అంతా మొహాలు చూసుకున్నారు. అందరి కళ్లల్లో కలవరం- కావేరి మొఖం మరింత నల్లబడింది.

'అదేమిటి హరీష్, ఏభై అరవై వేలొచ్చే ఉద్యోగం రిజైన్ యివ్వడం తెలివి తక్కువ పని అని అనిపించ


# మోనికా బుక్స్

**తెలుగు వెలుగులు**
75 మంది ప్రముఖుల
పదచిత్రాలు బాపు బొమ్మలతో
*వెల: 85 రూపాయలు*
*తాజా ఎడిషన్*

**కొత్త కెరటాలు**
ఆంధ్రజ్యోతి వీక్లీలో
1970లలో వెలువడిన
ప్రముఖులపై 71 వ్యాసాలు
*వెల: 75 రూపాయలు*

**ఒక్కడు** (చంద్రబాబు నాయుడి సమగ్ర జీవితకథ)
*వెల: 125 రూపాయలు*

**ఒకే ఒక్కడు**
ఎన్.టి.ఆర్. జీవితకథ
*వెల: 150 రూపాయలు*
*తాజా ఎడిషన్!*

**విశ్వ విహారం**
యాత్రారచన
*వెల: 60 రూపాయలు*

**కథాపత్రిక**
ఎంపిక చేసిన
20 కథల సంపుటి
*వెల: 60 రూపాయలు*

**ఐ.వి.ఆర్. -రాజసూయం**
ఉలుకు-పలుకు
వ్యాసాల సంకలనం
*వెల: 75 రూపాయలు*

యీ పుస్తకాలు విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ బుక్ హౌస్‌లతో సహా ప్రముఖ పుస్తకాల షాపులన్నిటిలో లభిస్తాయి. పోస్టు ద్వారా తెప్పించుకోదలచిన పాఠక మిత్రులు పుస్తకం వెలను ఎం.ఓ. లేదా డి.డి. ద్వారా పంపండి. పోస్టేజి ఉచితం.

**మోనికా బుక్స్**
ప్లాట్ నెం. 103, రోడ్ నెం. 71, నవనిర్మాణ్ నగర్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033.

లేదా...” ఆందోళన ఆయన గొంతులో.

‘ఏమో, మంచీ చెడో, తెలివి తక్కువ పనో నాకు తెలియదు. సంపాదించే నాకు సుఖం లేదు, నా ఉద్యోగం వల్ల నా భార్య కానందం లేదు... ఎవరి కోసం చెయ్యాలి రాత్రి పగళ్లు కష్టపడి... కనీసం డబ్బు యిచ్చే సుఖాల వల్ల భార్యనైనా సంతృప్తి పరచలేక పోయినపుడు యింకెందుకు యింత కష్టపడడం.

‘అదేమిటి హరీష్- సుఖంగా బతకడానికి కావల్సింది డబ్బు. అదే లేకపోతే యీమాత్రం అన్నా సుఖ సంతోషాలెక్కడుంటాయి. మంచి ఉద్యోగం వదిలి, ఏదో పది వేల ఉద్యోగం చేస్తాననడం... ఫూలిష్‌నెస్’ కించిత్తు కోపం, అసంతృప్తి ధ్వనించింది. కావేరి మొఖం ఊసరవెల్లిలా నిమిషానికో రంగు మారిపోతోంది.

‘డబ్బు సంపాదనకి అంతేం వుందిలెండి. పది వేల వాడికి యిరవై కావాలనుంటుంది. ఏభై వాడికి లక్ష కావాలనుంటుంది. మీ అమ్మాయీ చదువుకుంది. ఆవిడా సంపాదించొచ్చు కాస్తో కూస్తో... మా కోసం మేం బతకాలనుకుంటున్నాం- కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవాలి... యీ వయసు, యవ్వనం మళ్లీ రావు గదా- డబ్బు సంపాదనలో మరమనిషిలా మారిపో దల్చుకోలేదు. ఎక్స్‌క్యూజ్‌మీ... వాష్ చేసుకుని బట్టలు మార్చుకోవాలి. ఆ... ఏ గదిలోకి వెళ్లాలి’. ‘కావేరి లోపలికి తీసుకెళ్లు హరీష్‌ని’ మామగారి ఆర్డరు. గదిలోకి వెళ్లగానే చొక్కా కాలరు పట్టుకుని ‘ఏమిటీ డ్రామా’ అంది తీక్షణంగా. ‘నాటకం ఏమిటి, మై గాడ్ యిదంతా సరదాకన్నాననా నీ ఉద్దేశం-’ అంటూ షర్టు విడిపించుకుని బ్రీఫ్ కేసులోంచి రాజీనామా కాగితం, ఆఫీసు అంగీకరించిన కాగితం చూపాను. ఆ కాగితం లాగే కావేరి మొహం తెల్లబడింది. ‘యూ... యూ... నా మీద కక్షతో, నాకు బుద్ధి చెప్పాలనే చేశావు. ఉద్యోగం రిజైనిచ్చి పెళ్లాన్ని ఎలా పోషిద్దాం అని నీ ‘ఉద్దేశం’ ఆవిడ చూపులు, మాటలు బాణా లయ్యాయి. ‘ఏదో ఉద్యోగం దొరక్కపోదులే, లేకపోతే చదువుకున్న పెళ్లాం నీవుండగా నాకేం దిగులు-నీవు చేద్దు గానిలే’ తేలిగ్గా అనేసరికి ఉక్రోషం పట్టలేక చొక్కా పట్టుకుని రెండు పిడిగుద్దులు గుండెల మీద గుద్ది ‘ఇలా వచ్చానని, నాకు పాఠం నేర్పాలని గాదూ...’ ఆమె చేతిలోంచి విడిపించుకుని ‘డోన్ట్ బి సిల్లీ కావేరీ యు కెనాట్ హావ్ ఎవ్విరీ థింగ్- అవ్వా, బువ్వా రెండూ కావాలనుకోడం అత్యాశ’ అంటూ బాత్ రూములోకి వెళ్లిపోయాను- రాత్రి మీద చెయ్యేస్తే తోసేసింది. ఇంకోసారి ప్రయత్నించలేదు.

✧✧✧

శని ఆదివారాలు గడిచి రెండు రోజులయినా వెళ్లే ప్రసక్తి లేకపోవడంతో నాలుగో రోజు దబదబ బట్టలు సూట్‌కేస్‌లో పడేసి ‘పద, యింటికెడదాం’ అంది కోపంగా- ‘తొందరేం వుంది. కొన్నాళ్లు సరదాగా వుందామని వచ్చాను. ఉద్యోగం సద్యోగం లేదుగా ఎప్పుడెళ్లినా పరవాలేదు. అత్త వారింటి సరదా తీర్చుకోనీ.’

‘ఉద్యోగం సద్యోగం లేని అల్లుడ్ని ఏ అత్తవారూ గౌరవించరు’ రుసరుసలాడింది.

‘ఉద్యోగం లేని వాడ్నిగా, ఏమన్నా పట్టించు కోనులే’ నిర్లక్ష్యంగా అన్నా- పళ్లు కొరుక్కుంది.

పాపం అత్తగారు మామగార్ల స్థితి చూస్తే జాలేసింది- ఉద్యోగం మానిన అల్లుడ్ని ఏమనలేక, కూతురు భవిష్యత్తు గురించి బెంగ, కూతురి ప్రవర్తన వల్లే యిదంతా జరిగిందన్న ఆవేదన, అల్లుడ్ని తప్పు పట్టలేని నిస్సహాయత సతమతమవుతున్నారన్నది అర్థం అయింది.

‘ఆ సాయంత్రం లాన్‌లో అందరం కూర్చు నుండగా జనాంతికంగా ‘ఈనాటి పిల్లలకేం కావాలో వాళ్లకే తెలియడం లేదు. ఆలోచిస్తే ఆడ మగ తేడా లేకుండా చదివించి పెద్ద ఉద్యోగాలకి పంపడం తప్పనిపిస్తుంది. చదవేస్తే వున్న మతి పోయినట్టు చదువుతో పాటు రావలసిన అణకువ, మెచ్యూరిటీల కన్నా అహంభావం, అహంకారం, ఎవరినీ లెక్క చేయని తెంపరితనం ఎక్కువైంది’ కావేరి తండ్రి వంక చురచుర చూసింది. ‘నీవలా చూసినంత మాత్రాన నిజాలు అబద్ధాలవవు- ఏం మీ ఆడపిల్లలని పెద్ద చదువులు చదివించి ఉద్యోగాలకి పంపుతున్నాం- హాయిగా మీ కాళ్ల మీద మీరు నిలబడి ఎవరి జోలి అక్కర లేకుండా లైఫ్ ఎంజాయ్ చెయ్యండి- స్వతంత్రంగా హాయిగా ఆనందంగా వుండచ్చుగా- మళ్లీ మగతోడు కావాలి- వంటరితనం భరించలేరు. ప్రేమలంటారు. పెళ్లిళ్లకి దిగుతారు. మళ్లీ ఆ మొగుడనే వాడితో సర్దుకోరు. ఊ అంటే ఆ అంటే అవమానాలు జరిగిపోయి ఆత్మాభిమానాలు దెబ్బతినేస్తాయి. మాట పడని వ్యక్తిత్వాలు మావి అంటారు. నీవెంత అంటే నీవెంత అని దెబ్బలాటలు- ఏం ఇన్నాళ్లూ మనం నలుగురం యింట్లో ఏమీ అనుకోలేదా. అభిప్రాయ భేదాలు రాలేదా, వాదించుకోలేదా, దెబ్బలాడుకోలేదా, కోపాలు అలకలు రాలేదా, ఏం మాట మాట వచ్చి నపుడు మనం అందరం యిల్లొదిలి వెళ్లిపోయామా. కట్టుకున్న పాపానికి, ఒక యింట్లో వున్న పాపానికి మొగుడనే వాడితో మాట మాట వస్తే ఎందుకు సర్దుకోరు.’ ‘అవును సర్దుకోడాలన్నీ ఆడవాళ్లే చెయ్యాలి ఎప్పుడూ’ వ్యంగ్యంగా అంది. ‘ఆడ మగ అని కాదు యిద్దరున్నప్పుడు ఎవరో ఒకరు తగ్గాలి సంసారంలో- లేకపోతే ఏ సంసారం నిలవదు- ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నా యింతే...’ కావేరి కోపంగా లేచి వెళ్లి పోయింది. ఆయన నా చేయి పట్టుకున్నాడు. ‘ఇదో మూర్ఖురాలు, కాస్త నీవన్నా సర్దుకో-’. ‘సర్దుకోడానికీ ఓ లిమిట్ వుండదా అంకుల్- అన్నింటికీ అలకే! రుసరుసలే- తన మాట కాదనడానికి వీలు లేదంటే ఎలా.’ అవున్నాయనా మాకు తెలుసు, నిన్నేం అనలేం- భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు మీలో మీరే తీర్చుకోవాలి’ అత్తగారు ప్రాధేయపూర్వకంగా అన్నారు. ‘లీవ్ యిట్ టు మి అంకుల్.’ నే యిచ్చిన భరోసాతో వాళ్లు తేలిక పడ్డారు.

✧✧✧

పూర్ణించి వచ్చి పది రోజులు గడిచాయి- రాత్రిం బగళ్లు ఉద్యోగం సద్యోగం లేకుండా మగాడనే వాడు యింటి పట్టున వుంటే ఎలా వుంటుందో రుచి చూసాక ‘ఏమిటి యింట్లో కూచుని మూడు పూటలా తిని పడుకోడమేనా, ఉద్యోగ ప్రయత్నం ఏం చెయ్యదలచు కోలేదా.’ తీక్షణంగా నిలేసింది ఓరోజు పొద్దునే.

‘చూద్దాంలే- వెధవ ఉద్యోగం చేయొచ్చు- లైఫ్ కొన్నాళ్లు ఎంజాయ్ చెయ్యనీ- నీవు కోరిన రొమాన్సులు, శృంగారాలు, పిల్లల్ని కనే యత్నాలు యివన్నీ అవనీ, తృప్తితీరాక చూద్దాం’ కావేరి గంయ్ మంది. ‘ఉద్యోగం లేకుండా పిల్లల్ని కని ఏం పెట్టి పోషిద్దామని. అదొక్కటే తరవాయి. బుద్ధి లేకుండా మాట్లాడకు’ అరిచింది.

‘పోనీ నీవు చెయ్యి ఉద్యోగం- హాయిగా నేను యింట్లో పని, వంట పని చేసుకుంటూ పుస్తకాలు చదువుకుంటూ; టి.వి. చూసుకుంటూ ఎంజాయ్ చేస్తాను. ప్రామిస్ - ప్రతి పూటా నీకు వేడి వేడిగా చేసి పెడ్తాను- రాత్రుళ్లు శృంగార పాఠాలు చెపుతూ ఆనంద డోలికల్లో ఊగిస్తాను’ సినిమాటిక్‌గా అన్నాను.

‘షటప్. పెళ్లాం సంపాయిస్తే తిని కూర్చునే మొగుడ్ని ఏ ఆడదీ గౌరవించదని తెలుసుకో. ఏం చేస్తావో, ఎలా చేస్తావో పెళ్లాన్ని పోషించడం నీ వంతు. నేనే ఉద్యోగం చచ్చినా చెయ్యను. డబ్బు సంపాదిం చడం నీ పని’ తిరస్కారంగా అంది. ‘ఎస్. మై డియర్ వైఫ్- నౌ, యు హావ్ కమ్ టు మై పాయింట్. అవును ఉద్యోగం చేసి పెళ్లాన్ని పోషించడం మగాడి పని- మగాడు పెద్ద ఉద్యోగాలు చేసి వేలు సంపాదించాలి- బంగ్లా, కారు, ఫోన్లు, ఫ్రిజ్‌లు, ఓవెన్లు, వాషింగ్ మెషీన్లు సర్వ హంగులు సమకూర్చాలి భార్యలకి. రాత్రింబగళ్లు ఆఫీసులో గాడిద చాకిరి చేసి యింటికొచ్చి పెళ్లాన్ని షికార్లకి, సినిమాలకి, డిన్నర్లకి తిప్పాలి. మర్చిపోకుండా బర్త్ డేలు, మేరేజ్ డేలకి గిఫ్ట్‌లు, పార్టీలు యిచ్చి ఆనందపరచాలి- ప్రేమ అనురాగాలు ప్రదర్శించాలి- రొమాన్సులు జరపాలి. ఏం యింకేమన్నా మర్చిపోయానా లిస్టులో- యివన్నీ మొగుడనే అడ్డ గాడిద పని. మరి మీ పనేంటో- అల్సిపోయి వచ్చిన మొగుడికి కప్పు కాఫీ యివ్వడం, దగ్గర కూర్చుని కాస్త వేడిగా అన్నం పెట్టడం పాత కాలం పతివ్రతల లిస్టులో చేరిపోయినట్టు నూన్యతా భావం. ఆ మొగుడనే వాడు నోరిప్పి విసుక్కుంటే హింస పెడ్తున్నట్టు కోడై కూస్తారు. బజారు కీడుస్తారు. ఏం కోపం, తాపం, అవమానాలు మీ ఆడవాళ్ల సొత్తు- కట్టుకున్న పాపానికి పాపాల భైరవుడిలా అన్ని నిందలూ మగాడి నెత్తినేనా! ఒక యింట్లో వున్నాక కోపాలొస్తాయి, పంతాలొస్తాయి, దెబ్బలాటలొస్తాయి, అరచుకుంటాం- అలకలొస్తాయి... మర్చిపోవాలి- కల్సిపోవాలి- సారీ చెప్పుకోవాలి- అంతేగాని సూట్ కేస్‌లు పట్టుకుని పుట్టిళ్లకి పరిగెడితే ఏ తల్లి తండ్రి ఆదుకోరన్నది గ్రహించండి. సకల గుణ సంపన్నుడుగా వుండే మగాళ్లుండనట్టే పరమ శాంతమూర్తులు, సాధ్విలుగా ఆడవాళ్లూ వుండరు- ఎవరి అదుపు ఆజ్ఞలో వుండమంటే, హాయిగా సంపాదించుకుంటూ స్వేచ్ఛగా వుండండి. పెళ్లిళ్లు లేకుండా- సర్దుబాటు ధోరణి కావాలో- స్వేచ్ఛాయుత జీవనం కావాలో నిర్ణయించుకోవాల్సింది నీవు- ఇటీజ్ అప్ టూ యూ- నిర్ణయం తీసుకు చెప్పు” చాలా సీరియస్‌గా అనేసి బాల్కనీలో పేపరు పట్టుకు కూర్చున్నాను.

పావు గంట తర్వాత వెనక నుంచి మెడ మీద చేతులు బిగించి చేత్తో గడ్డంపైకి ఎత్తి నుదుటి మీద పెదాలద్ది ‘జాబ్ రిజైన్ చేయలేదులే, నాకు తెలుసు’ అంది గోముగా గుసగుసగా కావేరి. ‘మై గుడ్‌నెస్’ అనుకున్నా.

మీరే చూశారుగా పెళ్లాలంటే ఎంత సెల్ఫిషో, ఆవిడకి కావాల్సింది మొగుడు కాదు, ఉద్యోగం అని అర్థమయిందా లేదా!

*(ఎప్పుడూ ఆడవాళ్లకేనా సమస్యలు- పాపం పీత కష్టాలు పీతవన్నట్టు మగాళ్లనీ ఓ కంట కనిపెట్టాలి అనిపించి రూటు మార్చాను.)*

▲